క్లుప్తంగా

ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే, ఎంపీ



ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే మందుల సామేల్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

తిరుమలగిరి : తుంగతుర్తి శాసనసభ్యుడు మందుల సామేల్, భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సెక్రటేరియెట్‌లో కలిశారు. తుంగతుర్తి నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.

ఆర్థికసాయం అందజేత

మద్దిరాల : కుక్కడం గ్రామానికి చెందిన బీసు నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. దీంతో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు మద్దెల భిక్షపతి సోమవారం కార్యకర్తలతో కలిసి మృతుడి చిత్రపటానికి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మద్దెల రాములు, సీనియర్ నాయకులు మద్దెల వెంకటనర్సు, వెంకటవెల్లి వెంకటయ్య, మద్దెల ముత్తయ్య, మద్దెల యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలి



అర్వపల్లిలో నిర్వాహకుల నుంచి అనుమతి కాపీ తీసుకుంటున్న విద్యుత్ సిబ్బంది

అర్వపల్లి : గణేష్ ఉత్సవాల సందర్భంగా మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల విద్యుత్ ఏఈ శ్రీకాంత్ కోరారు. జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా 130 గణేష్ విగ్రహాలను ప్రతిష్ఠించగా అన్ని గ్రామాల నిర్వాహకుల నుంచి విద్యుత్ ఏర్పాటుకు సంబంధించిన పత్రాలను సోమవారం తీసుకున్నారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ జోక్కెల్, లైన్‌మెన్‌లు కె.వెంకటరెడ్డి, సతీష్‌రెడ్డి, సిబ్బంది హబీబ్, మల్లికార్జున్, శ్రీను, శేఖర్ పాల్గొన్నారు.

నేడు చాకలి ఐలమ్మ వర్ధంతి

అర్వపల్లి : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని మంగళవారం గ్రామ గ్రామాన నిర్వహించాలని రజక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దూదిగామ సంపత్ కోరారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఐలమ్మ పోరాట పటిమను ప్రజలకు తెలియపర్చాలని విజ్ఞప్తి చేశారు.

ప్రైవేట్ ఉపాధ్యాయుడికి పాన్ ఇండియా ఐకాన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న సాగర్

సూర్యాపేట : జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెల్లబండతండా గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు భూక్యా సాగర్ పాన్ ఇండియా ఐకానిక్ టీచర్ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డును ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు టీచర్స్ లెక్చరర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరులో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, గుంటూరు పడమర ఎమ్మెల్యే గల్లా మాధవి చేతుల మీదుగా ఆదివారం అందుకున్నారు.

కాళోజీ అడుగుజాడల్లో నడవాలి



మద్దిరాల : కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు



తిరుమలగిరి : మోడల్ స్కూల్‌లో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



తుంగతుర్తిలో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తుంగతుర్తి : ప్రజాకవి కాళోజీ నారాయణరావు అడుగుజాడల్లో నడిచి ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుండగాని రాములు, రవికుమార్, సంతోష్, మల్లేష్, వెంకటేష్, సాయికిరణ్, మల్లికార్జున్, వీరునాయక్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : ప్రజా కవి, అక్షర యోధుడు కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను సోమవారం మోడల్ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాల రాజు, జానయ్య, సంజీవ్ పాల్గొన్నారు.

భాషా ఔన్నత్యాన్ని కాపాడిన వ్యక్తి కాళోజీ

పెన్‌పహాడ్ : తెలంగాణ భాషా ఔన్నత్యాన్ని కాపాడిన మహావ్యక్తి కాళోజీ నారాయణరావు అని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కాళోజీ జయంతి వేడుకల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. తెలంగాణ భాషా సంస్కృతులకు ప్రతీక కాళోజీ అని అన్నారు. కాళోజీ చేసిన సేవలు, ఉద్యమాలు మరువలేనివన్నారు.



పెన్‌పహాడ్ : ఎంపీడీఓ కార్యాలయంలో..

తెలంగాణ భాష, యాస, గొప్పతనాన్ని సజీవంగా నిలిపిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సంజీవయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, సీనియర్ సహాయకులు ప్రసాద్, జూనియర్ సహాయకులు సంపత్, సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిరాల : ప్రజాకవి, తెలంగాణ సాంస్కృతిక సారథి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను సోమవారం మండల పరిధిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్షర పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేటటౌన్ : వివిధ రంగాలలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న వ్యక్తులకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అక్షర ఫౌండేషన్ సూర్యాపేట, ఎన్జీ వోస్ అసోసియేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అక్షర పురస్కారాల ప్రదానానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అక్షర ఫౌండేషన్ చైర్మన్ యాస రాంకుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అక్షర ఫౌండేషన్ కార్యాలయంలో ఏర్పా టు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ పురస్కారాలకు తెలంగాణ రాష్ట్రానికి చెందిన విద్య, ఉద్యో గ, వైద్య, క్రీడా, సాంస్కృతిక, కళా, సాహిత్య, పర్యావరణ, సాంకేతిక, సామాజిక రంగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారు అర్హులని తెలిపారు. వారు సాధించిన విజయాల పేపర్ కట్టింగ్స్, జిరాక్స్‌లు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు 2, పూర్తి బయోడేటా ఈ నెల 16లోపు అక్షర ఫౌండేషన్ కార్యాలయానికి పంపాలని కోరారు. పూర్తి వివరాలకు 95732 63625, 9492188878ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అక్షర ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పు నాగయ్య, సొల్లేటి ఉపేంద్రాచారి, సుభాష్ చంద్రబోస్, నెల్లుట్ల పాపయ్య, రుద్రాంగి కాళిదాసు, షేక్ యూసుఫ్, సైదులు, బత్తుల దామోదర్ రెడ్డి, తుంగతుర్తి జనార్దన చారి, అనుముల వెంకటేశ్వర్లు, నజీర్ భాష, అప్పారావు పాల్గొన్నారు.

వానరం.. జనాల్లో కలవరం



చివ్వెంల మండల కేంద్రంలో ఇళ్లపై సంచరిస్తున్న కోతులు

- చివ్వెంల మండలంలోని గ్రామాల్లో కోతుల స్వైర విహారం
- ఇళ్లలోకి చొరబడుతున్నాయని ప్రజల ఆవేదన

చివ్వెంల : చివ్వెంల మండల పరిధిలోని గ్రామాల్లో కోతుల బెడదతో ప్రజలు అల్లాడిపోతున్నారు. గ్రామాల్లో వానరాలు గుంపులుగా సంచరిస్తుండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇళ్లలోకి వచ్చి తినుబండారాలను, ఆహార పదార్థాలను ఎత్తుకెళ్తున్నాయని వాపోతున్నారు. వాటిని తరిమితే తిరిగి దాడి చేస్తున్నాయని, కోతుల దాడిలో పిల్లలకు, పెద్దలకు గాయాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్, గుంజలూరు, జి.తిరుమలగిరి, గుంపుల, తుల్జారావుపేట, బి.చందుపట్ల, ఉండ్రుగొండ, వల్లభాపురం, దురాజ్‌పల్లి, తిమ్మాపురం, మోదిన్‌పురం, ఐలాపురం, గాయంవారిగూడెం గ్రామాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉంది. గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ కోతులు దర్శనమిస్తున్నాయి. ఇళ్లలోకి, దుకాణాల్లోకి చొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకువెళ్తున్నాయి. దీంతో ప్రజలు రోజంతా తలుపులు వేసుకుని ఉండాల్సి వస్తోంది. మండలంలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామంలో గత వారం రోజుల క్రితం కోతులు పాఠశాలలో విద్యార్థులపై దాడి చేసి పలువురిని గాయపరిచాయి. అధికారుల స్పందించి కోతుల బెడద తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.

బయటకు వెళ్లలేకపోతున్నాం

మా గ్రామంలో కోతులు విపరీతంగా ఉన్నాయి. గ్రామంలో ఎక్కడ చూసినా గుంపులుగా సంచరిస్తున్నాయి. దీంతో బటయకు వెళ్లలేకపోతున్నాం. నిత్యం కోతులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మందలుగా సంచరిస్తూ ప్రజలపై దాడి చేసి గాయపరుస్తున్నాయి.

– గోగుల భిక్షం, వట్టిఖమ్మంపహాడ్

కోతుల బెడద నివారించాలి

చాలా గ్రామాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉంది. కోతులతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లలోకి, దుకాణాల్లోకి చొరబడి ఆహార పదార్థాలు, తినుబండారాలను ఎత్తుకెళ్తున్నాయి. అధికారుల స్పందించి గ్రామాల్లో కోతుల బెడదను అరికట్టాలి.

– ఎండీ. రఫీ, చివ్వెంల

చెరువు శిఖంలో నిర్మాణాలు భద్రమేనా?



తిరుమలగిరిలో ఆడిటోరియం నిర్మాణ ప్రదేశంలో నిలిచిన నీళ్లు



మున్సిపాలిటీ భవనంలోకి చేరిన నీళ్లు

- కొచ్చెరువు సమీపంలో తిరుమలగిరి మున్సిపాలిటీ, ఆడిటోరియం భవనాల నిర్మాణాలు
- ఇప్పటివరకు కొంతమేర పనులు పూర్తి
- చెరువు నిండడంతో నిర్మాణాల ప్రదేశంలోకి చేరుతున్న నీరు

తిరుమలగిరి : తాంబూలాలు ఇచ్చేశాం.. తన్నుకు చావండి అనుకున్నట్లుగా ఉంది మున్సిపాలిటీ అధికారుల పని తీరు. నిబంధనల ప్రకారం నిర్మించాల్సిన భవనాలను ప్రభుత్వ స్థలం ఉన్నదని చెరువు శిఖాలలో నిర్మిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. నూతనంగా ఏర్పడిన తిరుమలగిరి మున్సిపాలిటీలో గత సంవత్సరం సెప్టెంబర్ 5న రూ.5 కోట్లతో నూతన మున్సిపాలిటీ భవనం, రూ.3 కోట్లతో ఆడిటోరియం భవన నిర్మాణాలకు సూర్యాపేట, జనగామ ప్రధాన రహదారి పక్కన ఉన్న కొచ్చెరువు సమీపంలో శంకుస్థాపనలు చేశారు. ప్రస్తుతం మున్సిపాలిటీ భవన నిర్మాణ పనులు మాత్రం 50 శాతం పూర్తయ్యాయి. ఆడిటోరియం భవన నిర్మాణం పిల్లర్ల దశలోనే ఉన్నది. శనివారం, ఆదివారం కురిసిన వర్షాలకు చెరువు మొత్తం నిండటంతో ఆడిటోరియం పిల్లర్లలో నీళ్లు నిలిచాయి. మున్సిపాలిటీ బిల్డింగ్ కింద మొత్తం నిమ్ము వచ్చింది. గతంలో మున్సిపాలిటీ భవనానికి పిల్లర్లు వేసేటప్పుడు కూడా పెద్ద ఎత్తున నీళ్లు వస్తుండటంతో రోజూ మోటార్ల ద్వారా నీటిని తొలగించి పనులు చేపట్టారు. ఈ రెండు నిర్మాణాలు కూడా చెరువు శిఖంలోనే ఉన్నాయి. చెరువులో ఉన్న నీళ్లకు 100 మీటర్ల లోపే భవనాలను నిర్మిస్తున్నారు.

నిబంధనలు వర్తించవా..

సామాన్యులు ఇంటి నిర్మాణాలు చేసుకోవాలంటే సవాలక్ష రూల్స్ పాటించాలని చెప్పే అధికారులు సొంత భవనాలు నిర్మించుకునేటప్పుడు మాత్రం నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. చెరువులు, కుంటల పరిధిలో అక్రమ నిర్మాణాలపై కొరడా జలిపిస్తున్న ప్రభుత్వం.. సొంత భవనాల నిర్మాణంలో కూడా నిబంధనలు పాటించాలని ప్రజలు కోరుతున్నారు. చెరువు శిఖంలలో, ఎఫ్‌టీఎల్ పరిధిలో చేపట్టిన నిర్మాణాలను ఇప్పటికైనా ఆపాలని అంటున్నారు. కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి ఈ స్థలాల్లో భవనాల నిర్మాణాలు ఎందుకు చేపడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణం జరుగుతున్న మున్సిపల్ కార్యాలయం, ఆడిటోరియంల గురించి జిల్లా అధికారులకు తెలియజేశాం. కొద్దిపాటి వర్షానికే ఆడిటోరియం పిల్లర్లలో పెద్ద ఎత్తున నీళ్లు నిలిచాయి.

– శాగంటి అనసూయ, మున్సిపల్ చైర్‌పర్సన్

నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు



సూర్యాపేట టౌన్ : డీజే నిర్వాహకులకు కౌన్సిలింగ్ ఇస్తున్న పట్టణ సీఐ రాజశేఖర్



మద్దిరాల : సమావేశంలో పాల్గొన్న సీఐ శ్రీనివాస్, ఎస్ఐ వీరన్న



నాగారం : ఫణిగిరిలో మాట్లాడుతున్న సీఐ రఘువీర్‌రెడ్డి

సూర్యాపేటటౌన్ : వినాయక చవితి వేడుకల్లో ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పట్టణ సీఐ రాజశేఖర్ హెచ్చరించారు. సోమవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో డీజే సౌండ్ సిస్టమ్ నిర్వాహకులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. నియమాలు అతిక్రమించి డీజే సిస్టం పెట్టిన వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే వారిని సూర్యాపేట తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తామని తెలిపారు.

మద్దిరాల : వినాయక చవితి వేడుకల్లో ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ శ్రీనివాస్, ఎస్ఐ ఎం.వీరన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన శాంతి సంఘం సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఉత్సవాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమ నిబంధనలను గురించి ఉత్సవ కమిటీ సభ్యులకు వివరించారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకుండా చూడాలని అన్నారు. గణేష్ నిమజ్జనాన్ని సొంత గ్రామాల చెరువుల్లోనే చేసుకోవాలని సూచించారు. నిమజ్జనం రోజు డీజేలకు అనుమతి లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

నూతనకల్ : ఇతరులకు ఇబ్బందులు కలుగకుండా గణేష్ నవరాత్రోత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తుంగతుర్తి సీఐ శ్రీనివాస్ కోరారు. సోమవారం మండల పరిధిలోని సాయిరాం ఫంక్షన్ హాల్‌లో గణేష్ నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులకు, యువకులకు, గ్రామస్తులకు నిర్వహించిన శాంతి సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి మండపాన్ని గ్లోబెల్ జియో ట్యాగింగ్ చేసి పర్యవేక్షిస్తున్నామని అన్నారు. మండపాల వద్ద ఎలాంటి గొడవలకు ఆస్కారం లేకుండా నిర్వాహకులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మహేంద్రనాథ్, ఎంపీఓ శశికళ, ఆర్ఐ ప్రసాద్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నాగారం : ప్రజలు శాంతియుత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలని నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఆనంద్ గార్డెన్స్‌లో వివిధ శాఖల అధికారులతో, గణేష్ ఉత్సవాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలకు పటిష్టమైన పోలీసు భద్రత ఏర్పాటు చేశామని అన్నారు. ఉత్సవాల్లో డీజేలకు, బాణ సంచాలకు అనుమతి లేదని తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వి.బ్రహ్మయ్య, ఎంపీడీఓ ధార శ్రీనివాస్, ఎస్ఐ ఎం.ఐలయ్య, వివిధ శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వారం రోజులకు తెరుచుకున్న కేజీబీవీ



అర్వపల్లిలోని కేజీబీవీ గేటు వద్ద నిలిచి ఉన్న నీళ్లు

అర్వపల్లి : భారీ వర్షాల మూలంగా అర్వపల్లిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం పూర్తిగా జలమయమైంది. దీంతో బాలికలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నీళ్లలో నుంచి బాలికలను వారం రోజుల కిందట అధికారులు బయటకు తరలించి వారి వారి ఇళ్లకు పంపించారు. అప్పటి నుంచి కేజీబీవీకి సెలవులు ప్రకటించారు. నీళ్ల తగ్గడంతో తిరిగి విద్యాలయాన్ని సోమవారం పునఃప్రారంభించారు. ఇంకనూ వర్షపు నీళ్ల కొన్ని గేటు వద్ద నిలిచి ఉన్నాయి. పూర్తి స్థాయిలో నీళ్ల వెళ్లిపోయేలా చర్యలు తీసుకోవాలని.. మళ్లీ వర్షాలు పడితే నీళ్ల నిలవకుండా చూడాలని బాలికలు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. వర్షాలు తగ్గడంతో కేజీబీవీలో తరగతులు పునఃప్రారంభించామని ఎస్ఓ నాగరాణి తెలిపారు.

గుంతలమయమైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



చిల్పకుంట్ల రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

నూతనకల్ : మండల కేంద్రం నుంచి చిల్పకుంట్ల, వెంకెపల్లి గ్రామాల మధ్య ఉన్న రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం గుంతల రోడ్డుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు మాట్లాడారు. రోడ్డుపై అడుగుకో గుంత ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాత్రివేళల్లో ద్విచక్ర వాహనాలు, ఆటోలు ప్రమాదానికి గురవుతున్నట్లు తెలిపారు. స్థానిక శాసన సభ్యుడు మందుల సామేల్ చొరవ తీసుకొని వెంటనే రోడ్డు నిర్మాణ పనులను చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పులుసు సత్తయ్య, మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి, బొజ్జ శ్రీనివాస్, గజ్జెల శ్రీనివాస్‌రెడ్డి, కందాల కృష్ణారెడ్డి, సామ సురేందర్‌రెడ్డి, బండగొర్ల మల్లయ్య, బత్తుల తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

గణేశుడి విగ్రహాల వద్ద పూజలు, అన్నదానాలు



మద్దిరాల : గుమ్మడవెల్లిలో పూజలు చేస్తున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్



తుంగతుర్తిలోని శారదనగర్‌లో వినాయకుడి వద్ద పూజలు చేస్తున్న మాజీ ఎంపీపీ కవిత, భక్తులు

తుంగతుర్తి : మండల కేంద్రంలోని శారదనగర్‌లో వినాయకుడి వద్ద మాజీ ఎంపీపీ గుండగాని కవిత రాములుగౌడ్ సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పూజారి రామాచార్యులు, భక్తులు వెంకటనారాయణ, రమేష్‌గౌడ్, వెంకన్న, అనిల్, సైదులు, యాదగిరి పాల్గొన్నారు.

నూతనకల్ : మండల పరిధిలోని గ్రామాల్లో నవరాత్రోత్సవాల్లో భాగంగా సోమవారం వినాయకుడి మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అర్వపల్లి : మండల వ్యాప్తంగా 130 గణేష్ విగ్రహాలను ప్రతిష్ఠించగా నిర్వాహకులు, భక్తులు ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు. కొమ్మాల గ్రామంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద నిర్వాహకులు సోమవారం అన్నదానం చేశారు.

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో ఏర్పాటు చేసిన మండపం వద్ద సోమవారం ప్రత్యేక పూజలు చేశారు.

నాగారం : మండల కేంద్రంలోని బీసీ కాలనీలో శ్రీకృష్ణ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద బొబ్బలి మహేష్–స్వరూప దంపతులు సోమవారం అన్నదానం చేశారు. అనంతరం పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మద్దిరాల : భక్తి శ్రద్ధలతో గణేష్ నవరాత్రి వేడుకలను జరుపుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ అన్నారు. సోమవారం గుమ్మడవెల్లి గ్రామంలో గణేశుడి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రేట్నేని శ్రీనివాస్, మాన్‌సింగ్, మద్దెల భిక్షపతి, చెవిటి నర్సింహ, మహేష్, సందీప్, ఉమేష్ పాల్గొన్నారు.



అర్వపల్లి : కొమ్మాలలో అన్నదానం



తిరుమలగిరిలో పూజలు చేస్తున్న నిర్వాహకులు



నాగారంలో అన్నదానం చేస్తున్న భక్తులు

మావో స్ఫూర్తితో ప్రజా పోరాటాలు ఉధృతం చేస్తాం



చివ్వెంల : మావో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు



నూతనకల్ : చిల్పకుంట్లలో మావో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

చివ్వెంల : మావో జడాంగ్ స్ఫూర్తిలో ప్రజా పోరాటాలు ఉధృతం చేస్తామని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. సోమవారం మావో వర్ధంతి సందర్భంగా కుడకుడ గ్రామంలోని లెనిన్ నగర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మావో తన ఆలోచనతో చైనాలో నూతన ప్రజాస్వామిక విప్లవం సాధించడంలో ప్రధాన పాత్ర పోషించాడన్నారు. ఆయన పోరాటా స్ఫూర్తితో దేశంలో మతోన్మాద రాజకీయాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కారింగుల వెంకన్న, కొత్తపల్లి రేణుక, ఎర్ర అఖిల్ కుమార్, సూరం రేణుక, రాంజీ, పద్మ, సురేష్, శంకర్, బాలస్వామి, శ్రీదేవి, యల్లమ్మ, పద్మ, ఉమ, కల్పన, రేణుక, జయమ్మ, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : మావో ఆలోచనలను, ఆశయాలను నేటి యువత అనుసరించాలని ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పెద్దింటి రంగారెడ్డి అన్నారు. సోమవారం చిల్పకుంట్లలో నిర్వహించిన మావో వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేసోజు మధు, న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి సుంకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దగ్గుల మల్లయ్య, చీమల సోమయ్య, ముండ్ల మల్లయ్య, ఎలమకంటి సత్తెయ్య, పులుసు రాములు, జటంగి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



నాగారం : డి.కొత్తపల్లిలో..

నాగారం : మండల పరిధిలోని డి.కొత్తపల్లి గ్రామంలో మావో వర్ధంతిని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు సంపెట కాశయ్యలు మావో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. ఆధునిక ప్రపంచ చరిత్రలో అత్యంత ప్రభావ వంతమైన వ్యక్తులలో మావో ఒకరని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ గ్రామ కార్యదర్శి దండొలు ధనుంజయ్, సంపెట కృష్ణమూర్తి, దిగోజు వీరాచారి, గాదుదల శ్రీను, నర్సింగ రమేష్, సంపెట ఎల్లయ్య, వంగూరి చంద్రం, గొల్ల సోమన్న, చంద్రయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.